"గంగా స్నానం చేస్తే పాపాలన్నీ పోతాయనే కదా మనం ఇన్ని వ్యయ ప్రయాసలని భరించి ఇంతదూరం వచ్చి గంగాస్నానం చేసేది. ఇప్పుడు నాకు పాపం ఎక్కడుంది?"

అంతమంది నిత్యం గంగా స్నానం చేస్తున్నా, వాళ్ళంతా ఎందుకు స్వర్గానికి చేరుకోవడం లేదో, ఏ భావంతో గంగాస్నానం చేయాలో అప్పుడు పార్వతికి అర్థమైంది.

## 62. దైవాన్ని మోసం చేయలేవు

ఒకతను సముద్రయానం చేస్తూంటే అకస్మాత్తుగా తుఫాను చెలరేగింది. అతను ప్రాణభయంతో ఆపద మొక్కుల వాడైన వెంకటేశ్వరుడికి ఇలా మొక్కుకున్నాడు.

"స్వామీ! నేనీ కష్టంలోంచి నీ దయవల్ల బయట పడితే మా ఇల్లు అమ్మేసి, ఆ వచ్చిన పైకం మొత్తం నీ హుండీలో వేస్తాను."

వెంటనే అతనికి ఆకాశవాణి ఇలా వినిపించింది.

"అలాగే. నీ మొక్కు తప్పక తీర్చు."

మరుక్షణం తుఫాను ఆగిపోయింది. బ్రతికి బయట పడ్డ అతను ఇంటికి చేరాడు. అయితే అతనికి ఇల్లు అమ్మి ఆ డబ్బు తిరుమల హుండీలో వేయబుద్ధి కాలేదు. అందుకతను దేవుణ్ని మోసం చేసే ఓ పథకం ఆలోచించాడు. తన బావమరిదిని పిలిచి జరిగింది చెప్పాడు.

"మనం తెలివిగా వ్యవహరించాల్సిన సమయం ఇది. నా ఇంటి ఖరీదు పది లక్షల రూపాయలు చేస్తుంది. నేను నా ఇంటిని నీకు వెయ్యి రూపాయలకి అమ్ముతాను. నాకు నష్టం రాకుండా నా పెంపుడు కుక్కని నీకు తొమ్మిది లక్షల తొంభైతొమ్మిది వేల రూపాయలకి అమ్ముతాను. నువ్వా విధంగా కొను. తర్వాత నా ఇంటిని నాకు తిరిగి వెయ్యికి అమ్మేయి."

అందుకు బావమరిది ఒప్పుకున్నాడు. ఆ ప్రకారం అతను తన ఇంటిని, కుక్కని తన బావమరిదికి అమ్మేసాడు. ఆ వెయ్యి రూపాయలు తిరుమల హుండీలో వేసి మొక్కు తీర్చుకున్నాడు. మూడు నామాల వాడికి పంగనామం పెట్టిన తన తెలివికి అతను తెగ మురిసిపోయాడు.

మూడో రోజు అతనికి జ్వరం వచ్చింది. ఎన్ని మందులు వాడినా అది తగ్గలేదు. బాగా నీరసించి పోయాడు.

“ఇది ఆఖరి మందు. దీనికీ మీ జ్వరం తగ్గకపోతే ఇక ఆ దేవుడే మీకు దిక్కు.” ఓ మందు ఇచ్చి అతని డాక్టర్ చెప్పాడు.

ఆ మందు కూడా అతని జ్వరాన్ని తగ్గించలేకపోయింది. ఇక తనకి చావు తథ్యమని తెలీగానే, మళ్ళీ అతనికి ఏడుకొండలవాడు గుర్తుకు వచ్చాడు.

“స్వామీ! ఈ సారి కూడా మీరే నన్ను కాపాడాలి.” ప్రార్థించాడు.

మళ్ళీ అతనికి ఆకాశవాణి వినిపించింది.

“నీ పెంపుడు కుక్కని తెచ్చి నువ్వు నీ మంచానికి మూడు గంటలసేపు కడితే నీ జ్వరం తగ్గుతుంది.”

అతను వెంటనే తన బావమరిదికి కబురు పంపి పిలిపించి ఈ సంగతి చెప్పాడు.

“ నా పెంపుడు కుక్కని తెచ్చి నా మంచానికి కట్టు.”

ఆ బావమరిది సన్నగా నవ్వి చెప్పాడు.

“ఇప్పుడా కుక్క ఖరీదు ఇరవై లక్షలు. ఇష్టం ఉంటే కొని కట్టుకో. లేదా చావు.”

## 63. గొప్ప ఉపకారం

ఆ రోజు స్వాతంత్ర్య దినోత్సవం.

అనేకమంది పరోపకారులు ఆ రోజు ఖైదీలకి ఇవ్వడానికి అనేక వస్తువులతో జైలుకి వచ్చారు. ఖైదీలకి పెట్టే అన్నంలో పురుగులు ఉంటాయని